


# ముగ్ధ సంగమం

– దోరవేటి

అందమైన ఆ సౌధంలో అన్నీ మనోహరంగా అమర్చబడి ఉన్నాయి. అద్దాల్లాంటి గోడలు. ఆ గోడల మీద ప్రాణం పోసుకున్నట్లున్న సుందరాంగుల చిత్రాలు ఆ గృహంలోని స్త్రీల అందాలను సవాల్ చేస్తున్నట్లున్నాయి. ద్వారాలకున్న జిలుగు తెరలు ఆ సౌందర్యాలను ద్విగుణీకృతం చేస్తున్నాయి. నిత్యం మార్చే మామిడి తోరణాలు అందంతోపాటు కమ్మని సువాసనలు వెదజల్లుతూ, ఆ గృహం స్వచ్ఛతను, శుభ్రతను, ఆకర్షణనూ ప్రస్ఫుటిస్తున్నాయి. ఆర్ద్రతనద్దుకున్న వట్టివేళ్ళు, కస్తూరి, జవ్వాది పరిమళాలు మత్తుతోపాటు ఏదో తెలీని ఉద్రేకాన్ని నరాల్లో నింపుతున్నాయి. ఆ మందిరంలోని పై అంతస్తు ఎత్తుకు తగ్గట్లుగా అందంలోనూ పైచేయిగా ఉంది. అందులో అత్యంత రమణీయమైంది శయ్యా గృహం. నగిషీలు చెక్కిన మంచం, దానిపై హంసతూలికా తల్పం, ఆపై పాల నురుగు వంటి సన్నని, తెల్లని వస్త్రం. రకరకాల సుగంధ ద్రవ్యాల ఘుమ ఘుమలు ఆఘ్రాణవశాన మరో లోకాలకు తరలిస్తున్నాయి. ఆ మందిరాన్నానుకొని మరో విశాల సదనం. అందులో సంగీత, నృత్య కళలో నిష్ణాతులైన అంగనలు. వారికనువైన వస్తు చయాలు. ఆ మందిరంలో మునిమాపు సమయాన ఓ గణిక ఎక్కుపెట్టిన మన్మధుని బాణంలా మంచంమీద పడుకొని, ఆ రాత్రిని రసవత్తరంగా ఎలా మార్చాలో ఆలోచిస్తూన్నది.

ఆమె పేరు శివార్పిత. అది కళ్యాణ కటకంలోని వేశ్యావాటిక అని వేరుగా చెప్పనవసరం లేదు. కాలం పన్నెండో శతాబ్దం ద్వితీయార్థం; రాజు బిజ్జలుడు; ఆ కాలానికి ప్రతీకగా నిలిచిన చారిత్రక మహా పురుషుడు బసవేశ్వరుడు బిజ్జలుని మంత్రిగా, కోశాధికారిగా, ధర్మరక్షకుడుగా, న్యాయాధికారిగా ఉంటూ, శివభక్తులైన జంగమ దేవరలను అపర శివావతారులుగా ఆరాధిస్తూ, భక్తుల సేవే భగవంతుని సేవగా తన జవన గమనాన్ని మార్చుకొని, ఆ మార్గంలో చరిస్తూ, తరిస్తున్నాడు. ఆ సమయంలోనే...

బసవేశ్వరుని వద్దకు పరుగుపరుగున వచ్చాడొక జంగమయ్య. అతని పేరు సంగయ్య. సంగయ్య సిసలైన శివభక్తుడు. లౌకిక జ్ఞానం లోపించిన అమాయకుడు. వయసువచ్చినా బాల్యఛాయలు వీడని అమాయకుడు. అందుకే అందరూ అతడ్ని మందమతి అంటూంటారు కాని, అతడు ముగ్ధమతి. బసవనాది భక్తులా సంగయ్యను 'ముగ్ధ సంగయ్య' అని ముద్దుగా పిలుచుకుంటారు. ఆ అయ్యవారు ఆయాసంతో రొప్పుతూ ఇలా అన్నాడు-

"అయ్యా! బసవయ్యా! ఆ జంగమయ్యలంతా ఏదో లింగ పూజకు వెళ్తున్నారట. నేనూ వెళ్తానయ్యా!"

సంగయ్య ముగ్ధత్వానికి ముగ్ధుడైన బసవేశ్వరుడు- "ఈ వేళప్పుడు వాళ్ళు వెళ్తున్న ఆ పూజ వివరాలేవో తెలుసుకున్నావా స్వామీ?" అని అడిగాడు, అతడ్నే పరిశీలనగా చూస్తూ.

"అదేం అర్థం కాలేదు బసవణ్ణా! ఆ పూజకు ఇదే అనుకూలమైన వాతావరణం. హిమం వెదజల్లినట్లున్న వెన్నెల. కోరికలను పిల్లగాలులు, వెచ్చదనాన్ని వెతుక్కొమ్మనే చలి...' అని మురిసిపోతూ మజ్జనాలు (స్నానాలు) చేసుకొని, కొత్త బట్టలు వేసుకొని, సుగంధ ద్రవ్యాలు పూసుకొని, కర్పూర తాంబూలాలు తీసుకొని, అరవిరిసిన మల్లెలు చుట్టేసుకొని హడావుడిగా అయ్యలంతా వెళుతున్నారు. నాకాలస్యమైపోతుంది. తొందరగా పంపేయి బసవణ్ణా!" ప్రాధేయపడుతున్నట్లన్నాడు సంగయ్య.

"సరే! సరే!! సరే!! శరణుల కోరికకు తిరుగుంటుందా

> సంగయ్య సిసలైన శివభక్తుడు. లౌకిక జ్ఞానం లోపించిన అమాయకుడు. వయసువచ్చినా బాల్యఛాయలు వీడని అమాయకుడు. అందుకే అందరూ అతడ్ని మందమతి అంటూంటారు కాని, అతడు ముగ్ధమతి. బసవనాది భక్తులా సంగయ్యను 'ముగ్ధ సంగయ్య' అని ముద్దుగా పిలుచుకుంటారు.

ఆంధ్రభూమి స్వర్ణోత్సవ కథల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి రూ. 1,000/-గెల్చుకున్న రచన

స్వామీ! తప్పక వెళుదురుగానీ, ఇంతకూ రాత్రివేళ చేసే ఆ ప్రత్యేక పూజ పేరేమిటట...?" అన్నాడు మురి పెంగా ఆ మహేశ్వరుణ్ణి చూస్తూ.

"ఏమో! నాకు మాత్రం ఏం తెలుసు. ఆ బాచయ్య స్వామినడిగితే చెప్పాడు. అదీ... అదీ... ఆఁ... కలం కజ కరికకం' అని. పేరు మాత్రం చాలా వింతగా ఉంది కదూ!" అన్నాడు కళ్ళింత చేసుకొని సంగయ్య.

ఆ మాటలోని అర్థం తెలుసుకొని బసవ పరివేష్టిత భక్తజనాళి పగలబడి నవ్వారు. కళ్ళతోనే వాళ్ళను మందలించాడు బసవన.

"త్వరగా వెళ్ళి అభ్యంజనం చేసుకొనిరా స్వామీ! మిగతా ఏర్పాట్లన్నీ నేను చేస్తాగదా!" అన్నాడు ఆ జంగమయ్యతో.

సంగయ్య ఉబ్బితబ్బిబ్బై ఆ పనిలో పడ్డాడు. బసవే శ్వరుడు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తిచేశాడు.

అందంగా అలంకరించి, అవసరమైన ద్రవ్యాన్నిచ్చి, జంగమ దేవర సంగయ్యను 'ఆ పూజ'కోసం పంపాడు బసవన.

"అమ్మా! అమ్మా...! ఎవరో కొత్త విటుడు... ఎప్పుడూ ఈ దరిదాపుల్లో చూసి వుండలేదు. వయస్సు రమారమి ఇరవై ఉంటాడు. అందమా మారహరుణ్ణి తలపిస్తున్నది. చూపులు మాత్రం వింత గొలుపుతున్నాయి..." హంస తూలికా తల్పం మీద ఆలోచనా మగ్నురాలైయున్న శివార్పిత గణిక తెచ్చిన సమాచారంతో గబుక్కున లేచింది. కాలి అందెల ఘలంఘలల నిస్వనలనేపథ్యంగా ద్వారం దాకా వచ్చి, ఆ సరికొత్త అతిథిని చూసి ఆశ్చర్యమగ్న యైంది. చెలికత్తెల మందలింపు సంజ్ఞలతో తేరుకొని, వచ్చినవాణ్ణి చేరుకొని, కోకిల గళం విప్పింది.

"స్వామీ! దయచేయండి! ఎందుకక్కడే నిల బడిపోయారు. ఈ మందిరం మీదే సుమండీ!" అందంగా, ఆర్ద్రంగా, హార్దంగా ఆహ్వానించింది శివా ర్పిత.

"సుందరీ! ఎవరు నువ్వు? కైలసంలో హరుని సేవించే రుద్రగణికవా? ఇక్కడికెలా వచ్చావ్? ఎప్పుడొ చ్చావ్? ప్రతి రాత్రీ వస్తుంటావా?" మనసులోని సందే హాలన్నీ బయటపెట్టాడు సంగయ్య.

అన్నం ఉడికిన విషయం తెలుసుకునేందుకు ఒక్క మెతుకు చాలు కదా! ఆ విటుని తొలి పలుకులలోనే అమాయకత అర్థమైంది శివార్పితకు. అతడ్ని ఓ ఆటా డుకోవచ్చని, ఆ 'ఆట'లో అవలీలగా ఓడించవచ్చని, ఓటమిలోనూ విజయానందాన్ని చవిచూపించవచ్చనీ అనుకుంటూ-

"స్వామీ! ఆ శివునికంటే శివభక్తులే అధికులని బస వణ్ణ చెబుతుండగా విని, అందులోని నిజం గ్రహించా లని ఇలా వచ్చాను. ఆ మహాత్ముని వాక్కు నిజమేనని మిమ్మల్ని చూస్తుంటేనే తెలుస్తున్నది. మిమ్మల్ని సేవిం చడమే నా పరమ లక్ష్యం. మీకు కావలసినవన్నీ దాచు కోకుండా ఇవ్వడం నా సహజ గుణం. అన్నీ మీకు నివేదించడమే నా పరమ వ్రతం." అంటూ అతని చేయి పట్టుకుంది.

ఆ అపురూప లావణ్య సౌందర్య రాశిని అనిమి షుడై చూస్తూ, "ఇక పూజ ప్రారంభిద్దామా?" అన్నాడు సంగయ్య.

"అబ్బో! అమాయకులనుకున్నా! రసిక శిఖామ ణులే. మరీ అంత తొందరైతే ఎలా స్వామీ? మాకూ కొన్ని సంప్రదాయాలుంటాయ్." అంటూ అతడ్ని సుఖాసీనుడ్ని చేసి, వెండి పళ్ళెరం తెప్పించి, కాళ్ళు కడిగి నీళ్ళు తలపై చల్లుకున్నది. తనతో నడిపించు కుంటూ మేడమీదున్న శయ్యా గృహానికి తీసుకొని వెళ్ళింది.

అద్భుతమైన ఆ మందిరంలోని సౌందర్యాన్ని అవ లోకిస్తూ, ముత్యాల ముగ్గులు, స్ఫటిక సోపానాలు దాటుకొని, అచ్చెరువుగొలిపే ఆ శయన మందిరం సౌందర్యానికి ముగ్ధుడైపోతూ హంసతూలికాతల్పం



"సుందరీ! ఎవరు నువ్వు? కైలసంలో హరుని సేవించే రుద్రగణికవా? ఇక్కడి కెలా వచ్చావ్? ఎప్పుడొచ్చావ్? ప్రతి రాత్రీ వస్తుంటావా?"

పక్కన నిలబడిపోయాడు. అది అతనికి తల్పంగా గాక సదాశివుని అర్చావేదికగా ఆ మందిరం మహేశ్వ రుని కైలాసంగా అనిపించాయి సంగయ్యకు. అందుకే ఆ మంచం పక్కనే నేలమీద కంబళం పరచుకొని, శివార్చనకు సిద్ధమయ్యాడు. తనతోపాటు అర్చనలో పాల్గొంటుందని శివార్పిత వైపు చూశాడు.

అతని చూపులకూ, వర్తనకూ అర్థం కనుక్కోలేక ఆమె ఆశ్చర్యంగా నిరుత్తరయై అతని సరసనే కూర్చుంది.

"సుందరీ! నీవు భస్మం ధరించడం లేదేం?" సంగయ్య పూజకుపక్రమిస్తూ, భస్మధారణ చేస్తూ శివా ర్పిత నడిగాడు.

ఆమె అందంగా నవ్వింది. ఆపై మెల్లగా గళం విప్పింది- "స్వామీ! ఈ సాయంత్రమే ఓ అయ్య నాకు కైలాసంనుండి పార్వతీదేవి తన మేనికి రాసు కునే పచ్చవిభూతి ఇచ్చి వెళ్ళాడు. నేనది ధరించాను. చూడండి...!" అంటూ తన వొంటికి రాసుకున్న పసు పును, ఆ వంకతో ఒంపుల్నీ చూపించింది.

శివారాధన తత్పరుడైన సంగయ్య అది నిజమనే నమ్మాడు. ఆపై రుద్రాక్షమాలలు ధరిస్తూ- 'నువ్వు ధరించవే'మన్నాడు.

"అయ్యా శిరీష కుసుమ పేశలమైన ఈ శరీరం ఉప్పు సముద్రం తీరాన దొరికే రుద్రాక్షలను భరించలే దని, క్షీరసాగర తీరాన లభించే తెల్లరుద్రాక్షలనిచ్చా డొక జంగమయ్య. ఇవి నా ఒంటికి రాసుకొని ఎంత నునుపెక్కాయో చూడండి..." ఎద సంపద మీద కదిలే ముత్యాల హారాలను చూపే వంకతో అతనికి దగ్గరగా జరిగింది. పైటను పూర్తిగా తొలగించి, సౌందర్య కలశాలను చూపించింది.

"బాగున్నాయ్. చాలా బాగున్నాయి." అంటూనే ఆమె ముఖావలోకనం చేశాడా మహేశ్వరుడు. అత నికో అనుమానం కలిగింది. "అవునూ! రుద్రాక్షను ముక్కుమీద దాల్చావ్! ఇదేం సంప్రదాయం?" అన్నాడు ఆశ్చర్యంగా.

అతని ముగ్ధత్వానికి అల్లరిగా నవ్వింది అపరంజి. సమాధానం మాత్రం తోచలేదు- "ఏమో స్వామీ! ఈ సంగతి ఆ పరమేశ్వరునికే ఎరుక!" అంటూ చేతులెత్తి దండం పెట్టింది. బాహుమూలాల నుండి వచ్చే సుగంధాఘ్రాణం అందించాలనే మిషతో.

అది పట్టించుకోకుండానే మరో ప్రశ్న సంధించాడు ఆ జంగమదేవర- "అవునూ! నీవు జడలు ధరిం చవేం?" (జటాధారణ శివార్చనలో భాగం). అందుకా నెరజాణ-

"అయ్యా! భగవంతుని ప్రసాదంగా లభించే పూలు ధరించేందుకు కొంత భాగం వదిలి మిగతా శిరోజాలన్నీ జడగా మార్చాను." జడ చివర ధగధగ లాడే కుచ్చుల్ని వయ్యారంగా తిప్పి, గిలుక్కున నవ్వింది.

వీళ్ళిట్లా మాట్లాడుకుంటూండగానే నరుల్లో మరుల్ని నింపే హరుని శిర్కోలంకారమైన చందు రుడు ప్రాగ్దిశలో ఉదయించాడు. మన్మథ విరహాగ్నిలో దగ్ధమవుతున్న శివార్పితలో మదనోద్రేకం మరింత హెచ్చింది. కామిని ప్రేమజ్వాలను కన్నెత్తి చూడని అపర శివావతారుడిగా భాసిస్తున్న సంగయ్యను ఎలా మెప్పించాలో, అమర సుఖాస్వాదనకు ఎలా ఒప్పిం చాలో, తనకు అందిన పైకానికి న్యాయం చేయడమె ట్లాగో తోచని శివార్పిత చివరగా సంగీత నృత్యాలనాశ్ర యించింది.

గాత్ర, వాద్య, మృదంగ, నట్టువాంగాది సహకారాల నందించే తన చెలులను రప్పించి, మదన కదన భేరీని నాదం వంటి నృత్య గీతాల విందునందించి, మన్మథ యుద్ధానికి కవ్వించింది.

లింగార్చన మగ్నుడైన సంగయ్య ఆ సంగీత, సాహిత్య నృత్య కళల సుస్వరాలు భగవదర్చనకై విని యోగించే మంగళ వాద్యాలుగా భావించి, శరీరం రోమాంచితం కాగా, 'హరహర మహాదేవ!' అంటూ పదే పదే నినదిస్తూ సర్వేశ్వరుని సమారాధన గావించ సాగాడు.

మహేశ్వరుని నయన జ్వాలకు మసియైన మన్మథు నిలా అహంకార దేహమణగిన సుధాకరుడు పశ్చిమా ద్రిపై పడిపోయాడు. భక్తి జ్ఞాన ప్రకాశాన్ని అద్దుకున్న ప్రభాకరుడు ఉదయగిరిపై నావిర్భవించాడు. మసక చీకటిలో మరులు గొలిపే మన్మథాకారంలా దృగ్గోచర మైన సంగయ్య దేవుడు బాలభానుని లేత కిరణాల సోకున దివ్య ప్రభలనీనుతూ వెలిగిపోతున్నాడు.

నృత్య గాన తాళాలాగిపోయాయి. అలసి సొలసిన శివార్పితకు అతని దివ్య తేజస్సు నవలోకించగనే ఏదో అద్వితీయ శక్తి తనలో సంగమించినట్లనిపించింది.

"స్వామీ! ఇన్నాళ్ళూ రక్తి ఒక్కటే గొప్పదనుకు న్నాను. నిశ్చలమైన శివానురక్తి ఇంత అద్భుతమైందని, శాశ్వతానందదాయకమని ఇప్పుడే గ్రహించాను." అంటూ జలజల కన్నీరు రాలగా సంగయ్య దేవుని పదమందారాలను అభిషేకించింది శివార్పిత. ★

రచయిత చిరునామా:
**సి.చెన్నయ్య (దోరవేటి)**
గవర్నమెంట్ బోయస్ హైస్కూల్,
తిరుమలగిరి, సికింద్రాబాద్- 500 015.